క్లుప్తంగా

వైఎస్ జగన్‌ను కలిసిన ఎంపీపీ బోదెపు గోవింద్



తాడేపల్లిలో వైఎస్ జగన్‌ను కలిసి పెళ్లికి ఆహ్వానిస్తున్న ఎంపీపీ బోదెపు గోవింద్, బొద్దేడ ప్రసాద్

యలమంచిలి రూరల్: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని యలమంచిలి ఎంపీపీ బోదెపు గోవింద్, పార్టీ అరకు పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకుడు బొద్దేడ ప్రసాద్ బుధవారం తాడేపల్లిలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ నెల 18న యలమంచిలిలో జరగనున్న తన కుమారుడు వంశీనాయుడు వివాహానికి విచ్చేయాల్సిందిగా అధినేతను బోదెపు గోవింద్ ఆహ్వానించారు.

104 సేవలను సద్వినియోగం చేసుకోవాలి



వాడ్రాపల్లిలో మందులు అందజేస్తున్న సర్పంచ్ నూకరాజు

మునగపాక: ప్రతి ఒక్కరూ 104 సేవలను సద్వినియోగం చేసుకోవాలని మునగపాక పీహెచ్‌సీ సీహెచ్‌వో ఆర్.దేవకాంత కోరారు. మండలంలోని వాడ్రాపల్లిలో బుధవారం 104 సేవలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలన్నారు. ఎటువంటి అనారోగ్యం తలెత్తినా నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రదించాలన్నారు. బీపీ, సుగర్ ఉంటే క్రమం తప్పకుండా మందులు వేసుకోవాలన్నారు. ఈ శిబిరాన్ని సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు సందర్శించారు. రోగులకు మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య సూపర్‌వైజర్ నాగేశ్వరరావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


భోగాపురంలో జిల్లా స్థాయి క్రికెట్ టోర్నీ ప్రారంభం



క్రికెట్ టోర్నీని ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు లాలం రాంబాబు

అచ్యుతాపురం రూరల్ : భోగాపురంలో జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను జెడ్పీటీసీ సభ్యుడు లాలం రాంబాబు బుధవారం ప్రారంభించారు. ఈ నెల 22న జరగనున్న మరిడిమాంబ అమ్మవారి పండగ సందర్భంగా భోగాపురం క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి క్రికెట్ టోర్నీని నిర్వహిస్తున్నారు. ఈ టోర్నీలో 50 టీమ్‌లు పాల్గొంటున్నట్లు నిర్వాహకులు తెలిపారు. బీజేపీ మండల అధ్యక్షుడు కూండ్రపు నాయుడుబాబు, సీఐటీయూ మండల కన్వీనర్ కూండ్రపు సోమునాయుడు, భోగాపురం క్రికెట్ అసోసియేషన్ సభ్యులు కూండ్రపు పటేల్, లాలం అనీల్, గండి శ్రీను, సాయి, ప్రకాష్, స్వరూప్, లోకేష్, అజయ్ పాల్గొన్నారు.

పాటిపల్లిలో పాము హల్‌చల్



పాటిపల్లిలో ఇంటిలోకి దూరిన పాము

మునగపాక: మండలంలోని పాటిపల్లిలో ఓ పాము హల్‌చల్ చేసింది. ఓ మహిళ పాము కాటుకు గురికాకుండా ధైర్యం చేసి పామునే హతం చేసింది. వివరాలిలా ఉన్నాయి. పాటిపల్లి గ్రామానికి చెందిన భీశెట్టి లక్ష్మి(70) మాజీ వార్డు సభ్యురాలు. ఆమె ఒంటరిగా జీవనం సాగిస్తుంది. తన ఇంటిలోకి బుధవారం సాయంత్రం పాము ప్రవేశించింది. గమనించిన ఆమె ఎటువంటి భయం లేకుండా పామును చంపి ప్రమాదం నుంచి బయటపడింది.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి



శ్రీనివాసరావు(ఫైల్)

అచ్యుతాపురం రూరల్: రోడ్డు ప్రమాదంలో గాయపడి విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న ధర్మిరెడ్డి శ్రీనివాసరావు(46) బుధవారం మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. రామన్నపాలెంలో గత సోమవారం బైక్‌పై వెళ్తున్న శ్రీనివాసరావును లారీ వెనక నుంచి ఢీకొన్న ఘటనలో తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే ఆయనను కేజీహెచ్‌కు తరలించగా.. చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతి చెందారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఎలక్ట్రీషియన్‌గా పని చేస్తూ కుటుంబాన్ని పోషించే ఇంటి పెద్ద అర్ధాంతరంగా మరణించడంతో ఆ కుటుంబంలో దిక్కుతోచని పరిస్థితి నెలకొంది.

చిచ్చర పిడుగులు



కరాటే సాధన చేస్తున్న విద్యార్థిని

ఆపద కాలంలో ఆత్మరక్షణ ప్రతి ఒక్కరికి అవసరం. తనకు తాను ధైర్యంగా ఉంటూనే ప్రత్యర్థి, అగంతకుల బారి నుంచి రక్షించుకోవడం తప్పనిసరి. ఇందుకు ఎంతో ఓర్పు, నేర్పు, ఆలోచన, ఆత్మస్థైర్యం అవసరం. ముఖ్యంగా విద్యార్థి దశ నుంచే ఇలాంటి వాటిపై ఆసక్తిని పెంచి అందులో నైపుణ్యాలను అందిపుచ్చుకుంటే భవిష్యత్తులో ఎంతో ప్రయోజనం ఉంటుంది. యలమంచిలిలో పలువురు విద్యార్థులు కరాటేలో రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించడమే తమ లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు.



కరాటే సాధన చేస్తున్న విద్యార్థులు



లెగ్ టీచింగ్ ప్రదర్శిస్తున్న బాలిక

- కరాటేలో ప్రతిభ చూపుతున్న విద్యార్థులు
- పట్టణంలో మార్షల్ ఆర్ట్స్‌పై పెరుగుతున్న ఆసక్తి
- ప్రత్యేక శిక్షణనిస్తున్న ప్రైవేట్ శిక్షకులు
- వేసవిలో పిల్లల్ని శిక్షణ సంస్థల్లో చేర్పిస్తున్న తల్లిదండ్రులు

యలమంచిలి రూరల్: ప్రస్తుత రోజుల్లో ఆరోగ్యంగా ఉండాలంటే.. ప్రతి రోజూ వ్యాయామం అవసరం. ఈ విషయంలో పెద్దలు తూచా తప్పకుండా వ్యాయామం, నడక వంటివి చేస్తుంటారు. కానీ ప్రస్తుతం మొబైల్ ఫోన్ల మోజులో చిన్నారులు నిరంతరం వాటితోనే సహవాసం చేస్తున్న దృశ్యాలు మనకు దాదాపు ప్రతి ఇంట్లోనూ కనిపిస్తుంటాయి. అయితే యలమంచిలిలో కొందరు చిచ్చరపిడుగులు మాత్రం మాకు మొబైల్ ఫోన్లు వద్దు.. మా ఆరోగ్య రక్షణతో పాటు కరాటేలో రాణించడమే తమ లక్ష్యం అంటున్నారు. అందుకు ఈ వేసవి సెలవులను సద్వినియోగం చేసుకుంటూ ముందుకు సాగుతున్నారు. ప్రత్యేక వేసవి శిబిరాల్లో శిక్షణ పొందుతున్నారు.

యలమంచిలి పట్టణానికి చెందిన కరాటే శిక్షకుడు నక్కా వెంకటరమణ 30 ఏళ్లుగా ఎందరో విద్యార్థులు, చిన్నారులకు కరాటే విద్యను నేరిపిస్తూ జీవనం సాగిస్తున్నారు. విద్యార్థులకు కరాటే ప్రాముఖ్యతను వివరిస్తూ చిన్న వయసులోనే సాధన చేస్తే జాతీయ స్థాయిలో గుర్తింపు పొందవచ్చంటున్నారు నక్కా వెంకటరమణ. ఈయన వద్ద తర్ఫీదు పొందిన వందలాది మంది బ్లాక్ బెల్టులు సాధించారు. ఇటీవల జిల్లా, రాష్ట్ర స్థాయిలో జరిగిన పోటీల్లో ఇక్కడి విద్యార్థులు రాణించి, పెద్ద సంఖ్యలో పతకాలు సాధించారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రోత్సహిస్తున్నారు.

10 నుంచి ఉచిత శిక్షణ శిబిరం



కరాటే నేర్చుకుంటున్న బాలికల్లో మనోధైర్యం పెరుగుతోంది. ఎలాంటి ఘటనలు ఎదురైనా ఎదుర్కొంటామనే ధీమా వస్తుంది. కరాటే శిక్షణకు బాలికలే అధికంగా వస్తున్నారు. విద్యతో పాటు కరాటేలో శిక్షణ పొందడం వలన వ్యాయామం,ఆత్మస్థైర్యం పెంపొందుతాయి. ఈ నెల 10వ తేదీ నుంచి ఉచిత వేసవి శిబిరం ప్రారంభిస్తున్నాం. ఆసక్తి ఉన్న వారు గాంధీనగరంలో బీఎస్ఎన్ఎల్ కార్యాలయం ఎదురుగా ఉన్న కార్యాలయంలో సంప్రదించవచ్చు.

– నక్కా వెంకటరమణ, కరాటే మాస్టర్, అంతర్జాతీయ కరాటే ఫెడరేషన్ సభ్యుడు, రిఫరీ

కరాటే అంటే చాలా ఇష్టం



చిన్నప్పట్నుంచి కరాటే అంటే చాలా ఇష్టం. అమ్మనాన్న నేర్చుకునేందుకు అనుమతి ఇవ్వడంతో శిక్షణ తీసుకున్నా. ప్రతి రోజూ సాయంత్రం రెండు గంటలకు పైగా కరాటే సాధన చేస్తున్నాను. కరాటే సాధనతో సెల్ఫ్ డిఫెన్స్ చేసుకోవచ్చు. పిల్లలు ఎలాంటి ఘటననైనా ఎదుర్కొనగలరన్న నమ్మకం తల్లిదండ్రుల్లో కూడా కలుగుతోంది.

– ఎస్‌కే ఆఫ్రీన్, రాష్ట్ర స్థాయి గోల్డ్ మెడలిస్ట్

ఆసక్తిగా నేర్చుకుంటున్నారు



విద్యార్థులంతా ఏకాగ్రతతో కరాటే సాధన చేస్తున్నారు. కొత్తగా వచ్చిన వారు కూడా ఎంతో ఆసక్తితో తర్ఫీదు పొందుతున్నారు. తక్కువ సమయంలోనే పోటీల్లో రాణిస్తున్నారు. యలమంచిలిలో ప్రతిభ కలిగిన విద్యార్థులు ఉన్నారు. కరాటే సాధన వల్ల చదువులో కూడా మంచి ప్రతిభ కనబరిచేందుకు అవకాశం ఉంటుంది.

– కె.శ్రీను, కరాటే శిక్షకుడు

ఎంతో ధైర్యంగా ఉంది



గత కొంత కాలంగా కరాటే నేర్చుకుంటున్నాను. ప్రతి రోజూ సాయంత్రం సమయంలో కరాటే మాస్టర్ పలు మెలకువలు చెబుతున్నారు. తమను తాము ఎలా రక్షించుకోవాలో సూచిస్తున్నారు. దీంతో ఎదుటి వారిని ఎలాగైనా ఎదుర్కొంటామనే నమ్మకం కలుగుతుంది.

– ఈ.శాంతి, ఈ.రాకేష్, యలమంచిలి

ఇదేం ఉపాధి వేతనం?



టెక్నికల్ అసిస్టెంట్‌ను ప్రశ్నిస్తున్న ఉపాధి కూలీలు

ఎస్.రాయవరం: చేసిన పనికి సక్రమంగా ఉపాధి వేతనం రావడం లేదని ధర్మవరం అగ్రహారంలో ఉపాధి కూలీలు ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బందిని ప్రశ్నించారు. రెండు నెలల కిందట చేసిన పనులకు సంబంధించి వేతనాలు ఇటీవల బ్యాంకు అకౌంట్లలో జమ అయ్యాయి. అయితే ఆ నగదు రోజువారీ లెక్కన చూసుకుంటే కొందరికి సుమారు రూ.30, మరికొందరికి రూ.66 చొప్పున పడినట్టు లబ్ధిదారులు పేర్కొన్నారు. ప్రభుత్వం ఉపాధి కూలీ రోజుకు రూ.300 తక్కువ కాకుండా ఇస్తామని చెప్పి, ఇప్పుడు ఇలా రావడం ఏమిటని టెక్నికల్ సిబ్బందిని ప్రశ్నించారు. గ్రామంలో మేట్లు పంపిన మత్సర్లు సరిగ్గా లేవని, సందేహాలు ఉంటే తమ దృష్టికి తీసుకొస్తే సరిచేస్తామని టెక్నికల్ అసిస్టెంట్ చెప్పారు.

ఆటో డ్రైవర్లు నిబంధనలు పాటించాలి



ఆటో డ్రైవర్లతో మాట్లాడుతున్న సీఐ రామకృష్ణ

ఎస్.రాయవరం: ఆటో డ్రైవర్లు తప్పనిసరిగా నిబంధనలు పాటించి వాహనాలు నడపాలని అడ్డురోడ్డు సీఐ రామకృష్ణ అన్నారు. అడ్డురోడ్డు జంక్షన్‌లో తుని, యలమంచిలి, నర్సీపట్నం ఆటో స్టాండ్ డ్రైవర్లకు బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ నిబంధనలు ప్రకారం ఆటో నడపకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

‘కుట్టు శిక్షణ’ కుంభకోణంపై విచారణ చేపట్టాలి



సూపరింటెండెంట్ ప్రసాద్‌కు వినతిపత్రం అందిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

మునగపాక: కూటమి ప్రభుత్వం కుట్టు శిక్షణ పేరిట కోట్లాది రూపాయల కుంభకోణానికి తెరతీసిందని వైఎస్సార్‌సీపీ యలమంచిలి నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షులు బొద్దేడ చెల్లయ్యనాయుడు ఆరోపించారు. ఈ విషయమై విచారణ చేపట్టి ప్రజాధనాన్ని కాపాడాలన్నారు. బుధవారం ఆయన పార్టీ నేతలతో కలిసి మండల పరిషత్ సూపరింటెండెంట్ ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీ కార్పొరేషన్ నిధులతో కుట్టు శిక్షణ ఇచ్చేందుకు రాష్ట్ర వ్యాప్తంగా నిధులను లూఠీ చేస్తున్నారన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను విస్మరించడం విచారకరమన్నారు. బీసీల ఓట్లతో అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం బీసీలకు చేసిందేమీ లేదని ధ్వజమెత్తారు. నిరుద్యోగ యువతకు ఉపాధి, రైతులకు అన్నదాత సుఖీభవ, అర్హులకు పింఛన్‌లు, తల్లికి వందనం తదితర హామీలను బుట్టదాఖలు చేశారన్నారు. ఎస్‌సీ సెల్ విభాగం జిల్లా అధ్యక్షుడు పిల్లి అప్పారావు మాట్లాడుతూ రాజధాని పేరిట సరికొత్త డ్రామాలు ఆడుతూ డైవర్షన్ పాలిటిక్స్‌కు పెట్టింది పేరుగా చంద్రబాబుకు గుర్తింపు ఉందన్నారు. కుట్టు శిక్షణ పేరిట రూ.167 కోట్ల మేర కూటమి ప్రభుత్వం స్వాహా చేస్తుందన్నారు. ప్రజలంతా కూటమి పాలన పట్ల ఏడాదికే పెదవి విరుస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు పెంటకోట స్వామి సత్యనారాయణ, పార్టీ మండల అధ్యక్షుడు ఆడారి అచ్చియ్యనాయుడు, యువజన విభాగం మండల అధ్యక్షుడు బొద్దేడ లిల్లీ, ఎంపీటీసీలు బోడకుర్తి గణేష్, బొద్దేడ బుజ్జి, గణపర్తి సర్పంచ్ చదరం నాయుడు పాల్గొన్నారు.

పరిశ్రమల్లో భద్రతా చర్యలు తప్పనిసరి



మాట్లాడుతున్న లాయర్ నూకరాజు

ఎస్.రాయవరం: పరిశ్రమల్లో కార్మికులకు భద్రతా చర్యలతో పాటు విధిగా వసతులు కల్పించాలని యలమంచిలి కోర్టు ప్యానల్ అడ్వకేట్ టి.నూకరాజు అన్నారు. గుడివాడ శివారులో ఉన్న సాయి మెరైన్ పరిశ్రమలో కార్మికులకు బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మిక చట్టాలకు లోబడి కార్మికులతో పనులు చేయించాలని, పనులు చేసేటప్పుడు అవసరమైన భద్రత పరికరాలు విధిగా ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక వీఆర్వో గోపి, మణికుమార్, తదితరులు పాల్గొన్నారు.

సంపద కేంద్రాల పరిశీలన



చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను పరిశీలిస్తున్న ఎంపీడీవో చంద్రశేఖరరావు

పాయకరావుపేట: మండలంలోని పీఎల్‌పురం, మంగవరం గ్రామాల్లోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను బుధవారం ఇన్‌చార్జ్ ఎంపీడీవో సిహెచ్.చంద్రశేఖరరావు పరిశీలించారు. ఈ సందర్భంగా సంబంధిత పంచాయతీ కార్యదర్శులు పనితీరుపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. షెడ్ల వద్ద వాటర్, ఎలక్ట్రికల్, తదితర పనులు సరిగ్గా చేపట్టలేదన్నారు. పీ–4 సర్వే సక్రమంగా జరగలేదన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించినందున షోకాజ్ నోటీస్ జారీ చేస్తున్నట్టు ఎంపీడీవో తెలిపారు. మండలంలో పంచాయతీ కార్యదర్శులు తమ పరిధిలోని లేఅవుట్స్ వివరాలు త్వరగా పంపాలని ఆయన ఆదేశించారు. పాయకరావుపేట, పీఎల్ పురం, నామవరం, సీతారాంపురం, పీఆర్‌బీ పురం, శ్రీరాంపురం, పాల్మన్‌పేట, కేశవరం పంచాయితీ కార్యదర్శులు తక్షణమే స్పందించి నివేదికను సమర్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో పీఎస్ఎస్ శివరాం, కొండరావు, రమేష్, సీవో రాజు, మల్లికార్జునాచారి పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికట్టాలి



మాట్లాడుతున్న రమ్య

మునగపాక: బాల్య వివాహాలను ప్రతి ఒక్కరూ అరికట్టాలని జిల్లా బాలల సంరక్షణ విభాగ ప్రతినిధి ఎల్‌వీ రమ్య కోరారు. జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశాల మేరకు జిల్లా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ సంయుక్త నిర్వహణలో మండలంలోని మడకపాలెంలో బుధవారం కిషోర వికాసంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 11 నుంచి 18 సంవత్సరాల లోపు వయస్సున్న బాలికల ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలన్నారు. కౌమార దశలో ఉన్న పిల్లలను గుర్తించి గ్రామస్థాయిలో సంఘాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. బాల్య వివాహాలు, లైంగిక వేధింపులు, పిల్లలతో భిక్షాటన, బాలల అక్రమ రవాణా తదితర అంశాలపై అవగాహన కల్పించారు. గ్రామ మహిళా కార్యదర్శి పుష్పలత, ఆశ కార్యకర్త జ్యోతి, అంగన్‌వాడీ టీచర్ షేక్ నగోరబి, వీవోఏ విజయలక్ష్మి, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

అల్లూరి పోరాటం స్ఫూర్తిదాయకం



గుర్రాజుపేటలో అల్లూరి విగ్రహం వద్ద అంజలి ఘటిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



అచ్యుతాపురంలో అల్లూరి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు



వెంకటాపురంలో నివాళులర్పిస్తున్న సర్పంచ్ తాతాజీ, సచివాలయ ఉద్యోగులు

నక్కపల్లి: మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు పోరాటం స్ఫూర్తిదాయకమని పలువురు వక్తలు కొనియాడారు. అల్లూరి వర్థంతి సందర్భంగా బుధవారం నక్కపల్లి సీఐటీయూ కార్యాలయం వద్ద ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా కార్యదర్శి ఎం.అప్పలరాజు మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం తీసుకురావడం కోసం ప్రాణాలర్పించారన్నారు. అల్లూరి ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ప్రసాద్, అప్పారావు, సత్తిబాబు, శ్రీను, రాజు పాల్గొన్నారు.

ఎస్.రాయవరం: అల్లూరి ఆశయాలకు అనుగుణంగా యువత నడుచుకోవాలని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మధువర్మ పిలుపునిచ్చారు. గుర్రాజుపేట, ఆర్‌వీనగర్‌లో బుధవారం అల్లూరి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ధర్మవరం అగ్రహారంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు ఎం.అప్పలరాజు అల్లూరి విగ్రహానికి పూలమాలవేసి అంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు రామరాజు, తదితరులు పాల్గొన్నారు.

అచ్యుతాపురం రూరల్ : అచ్యుతాపురంలోని అల్లూరి సీతారామరాజు విగ్రహానికి జన విజ్ఞాన వేదిక నాయకుడు మారిశెట్టి వెంకటప్పారావు పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రొంగలి రాము, మండల కన్వీనర్ కూండ్రపు సోమునాయుడు, యువకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మునగపాక: మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు వర్ధంతి కార్యక్రమాలను మండలంలో పలు చోట్ల నిర్వహించారు. వెంకటాపురం సచివాలయ ప్రాంగణంలో అల్లూరి చిత్రపటానికి సర్పంచ్ సుందరపు తాతాజీ పూలమాల వేసి అంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో కడియం అనురాధ, సచివాలయ ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అవసరం



పర్యావరణంపై అవగాహన కల్పిస్తున్న బయాలజీ టీచర్ కల్యాణి



పాయకరావుపేట గ్రంథాలయంలో అల్లూరికి నివాళులర్పిస్తున్న పాఠకులు, విద్యార్థులు

నక్కపల్లి: వేసవి శిబిరాల్లో భాగంగా చినదొడ్డిగల్లు శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు పర్యావరణంపై అవగాహన కల్పించారు. బుధవారం గ్రంథాలయంలో స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన బయాలజీ టీచర్ కల్యాణి పర్యావరణ పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, కాపాడుకోకపోతే వచ్చే నష్టాల గురించి వివరించారు. పచ్చదనాన్ని పెంచుదాం, నీటిని రక్షిద్దాం, చెట్లను పెంచుదాం, పర్యావరణాన్ని కాపాడుకుందాం అంటూ నినాదాలు చేయించారు. ఏబీసీడీ విటమిన్ల వల్ల కలిగే ఉపయోగాలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి జనార్దన్, సిబ్బంది రమణమ్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

పాయకరావుపేట: పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో బుధవారం వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా వెంకటేష్ మాస్టర్ విద్యార్థులకు మ్యాథ్స్ చెప్పారు. బుధవారం మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు వర్ధంతి సందర్భంగా చిన్నారుల సమక్షంలో ఘన నివాళులర్పించారు. అల్లూరి చిత్ర పటానికి ముఖ్యఅతిథి రఘురామరాజు పూల మాల వేసి జ్యోతి ప్రజ్వలన చేశారు. విద్యార్థులతో యోగా చేయించారు.

వాసవీమాతకు లక్ష మల్లెల పూజ



అనకాపల్లి: స్థానిక మెయిన్‌రోడ్డు కన్యకాపరమేశ్వరి (వాసవీ మాత) ఆలయం ఆవరణలో అమ్మవారి జన్మదిన వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. వందేళ్ల చరిత్ర కలిగిన అమ్మవారి ఆలయాన్ని పట్టణంలో 1925లో స్థాపించారు. ఈ నేపథ్యంలో వైశాఖ మాస శుద్ధ దశమిన అమ్మవారి జన్మదిన వేడుకలు ఏటా నిర్వహిస్తున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు చెప్పారు. తెల్లవారుజామున అమ్మవారి నామ భజన సంకీర్తన, మేళ తాళాలతో పట్టణ పురవీధుల్లో అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని పల్లకిలో ఊరేగించారు. అనంతరం నిత్యప్రార్థనలు, గోపూజ, నగరేశ్వర స్వామి జనార్దన్ స్వామి వారికి అభిషేకాలు అర్చనలు నిర్వహించారు. మండపంలో అమ్మవారి ఉత్సవమూర్తికి భక్తులతో బియ్యాభిషేకం, అమ్మవారికి లక్ష మల్లెపూలతో అర్చన, సామూహిక లలిత సహస్ర నామ స్తోత్ర పారాయణం, మధ్యాహ్నం భారీ అన్న సమారాధన, ఆలయం చుట్టూ వెండి రథంపై అమ్మవారి ఉత్సవ విగ్రహంతో 102 రకాల మిఠాయిలతో ప్రదర్శన, రాత్రికి ఊంజల్ సేవ, కోలాటాలు వంటి అనేక కార్యక్రమాలు జరిగాయి.

పాఠశాలల పునర్వ్యవస్థీకరణను వ్యతిరేకిస్తూ 12న ధర్నా



మాట్లాడుతున్న సుర్ల మురళీమోహన్

అనకాపల్లి: వైఎస్సార్‌సీపీ పాలనలో ఆరు రకాల పాఠశాలలుగా విభజిస్తే, కూటమి ప్రభుత్వం వాటిని తొమ్మిదిగా విభజించి విద్యార్థులను గందరగోళ పరిస్థితుల్లోకి నెట్టి వేస్తుందని ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(యూటీఎఫ్) రాష్ట్ర కార్యదర్శులు సుర్ల మురళీమోహన్, కిశోర్, డి.రాములు విమర్శించారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో యూటీఎఫ్ ఒక రోజు శిక్షణ తరగతుల్లో భాగంగా బుధవారం ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం విద్యను ప్రయోగశాలగా మార్చొద్దని కోరుతున్నామన్నారు. పాఠశాలల పునర్వ్యవస్థీకరణలో అసంబద్ధాలను వ్యతిరేకిస్తూ ఈ నెల12న జిల్లా స్థాయి ధర్నా నిర్వహిస్తామన్నారు. రాష్ట్ర ఉన్నతాధికారులు జీవో నంబరు 117ను రద్దు చేశామని చెబుతున్నా, అందులో ఉపాధ్యాయ విద్యార్థి నిష్పత్తిని కొనసాగించడం తగదన్నారు. హైస్కూళ్లలో ఉపాధ్యాయ విద్యార్థి నిష్పత్తి 1:40గా, ప్రాథమిక పాఠశాలలో 1:20గా ఉండాలని, యూపీ పాఠశాలలను ఎత్తి వేయడం వల్ల గ్రామీణ విద్యార్థులు విద్యకు దూరమయ్యే ప్రమాదం ఉందన్నారు. 40 మంది విద్యార్థులున్న ప్రాథమిక పాఠశాలలను మోడల్ ప్రైమరీగా మార్చాలన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు 12వ వేతన సవరణ కమీషన్ వేసి, 30% మధ్యంతర భృతి ప్రకటించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా యూటీఎఫ్ ప్రధాన కార్యదర్శి గొంది చినబ్బాయ్, గౌరవాధ్యక్షుడు పంపనబోయిన వెంకట్రావు, సహాధ్యక్షుడు రొంగలి అక్కునాయుడు, కోశాధికారి జోగా రాజేష్, కార్యదర్శులు గుత్తుల సూర్యప్రకాష్, పొలిమేర చంద్రరావు, శేషుకుమార్, మాకిరెడ్డి రాజునాయుడు, రాష్ట్ర కౌన్సిలర్ ఎం.వి. అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

అతివేగంగా వెళ్తున్న లారీలపై చర్యలకు డిమాండ్



మునగపాక మెయిన్‌రోడ్డులో లారీ డ్రైవర్‌తో వాగ్వాదం చేస్తున్న గ్రామస్తులు

మునగపాక: ఒకరిని ఢీకొట్టి వేగంగా వెళ్లిపోతున్న లారీని మునగపాక గ్రామస్తులు బుధవారం అడ్డుకున్నారు. పూడిమడక రోడ్డులో మునగపాక వద్ద ముందుగా వెళ్తున్న ద్విచక్ర వాహనదారుడిని వెనక నుంచి వస్తున్న లారీ ఢీకొంది. సంఘటన స్థలం నుంచి లారీని ఆపకుండా వేగంగా వెళ్తున్న లారీని స్థానికులు అడ్డుకుని, డ్రైవర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న హెచ్‌సీ ధనరాజ్ సంఘటనా స్థలానికి చేసుకొని ఇరు వర్గాల వారికి సర్దిచెప్పి పంపించేశారు. వాగ్వాదం కారణంగా రహదారికి ఇరు వైపులా వాహనాలు నిలిచిపోయాయి. ట్రాఫిక్‌కు ఇబ్బందులు లేకుండా పోలీసులు చర్యలు తీసుకున్నారు.